

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 10 జూలై 2025



● కియ కార్ల పరిశ్రమ


జిల్లా కేంద్రంలోని కప్పలబండ పారిశ్రామికవాడ



ఆశల ఊసులు..!

పారిశ్రామికాభివృద్ధి కోసం ఎదురుచూపు

పుట్టపర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పారిశ్రామికాభివృద్ధికి శ్రీకారం చుట్టిన దార్శనికుడు సీఎం చంద్రబాబునాయుడు. అంతర్జాతీ య కార్ల దిగ్గజం కియ రాకతో అనేక అనుబంధ పరిశ్రమలు, కేంద్ర సంస్థలు జిల్లాకు వచ్చాయి. దీంతో జిల్లాలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. నిధులు లేక కునారిల్లుతున్న హంద్రీ నీవాకు టీడీపీ పాలనలోనే మోక్షం కలిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో చెరువులకు జలకళ వచ్చింది. బీళ్లుగా ఉన్న భూములు పచ్చని పంటలతో సస్యశ్యామలం అయ్యాయి. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనతో నీరసించిన పలు రంగాలు ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో కోలుకుంటున్నాయి. జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఇక్కడి ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆశలు పెట్టుకున్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో భాగంగా గురువారం జిల్లాలోని కొత్తచెరువుకు ముఖ్యమంత్రి వస్తున్నారు. ఈక్రమంలో ఆయన జిల్లాకు ఏమి వరాలు ప్రకటిస్తారోనని ఎదురుచూస్తున్నారు.

అనుకూలతలివే..

జిల్లాలో మడకశిర నుంచి కదిరి దాకా రాప్తాడు నుంచి హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి వరకు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములున్నాయి. లక్ష ఎకరాలకు పైగా అసైన్డ్, ప్రభుత్వ భూములు ఉన్నాయి. జిల్లా సరిహద్దుకు సమీపంలో కర్ణాటకలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. జాతీయ రహదారి 44 జిల్లా మీదుగా వెళ్తోంది. ఇలాంటి అనుకూలతలు ఉన్న జిల్లా అభివృద్ధికి టీడీపీ పాలన(2014-1)లో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ అభివృద్ధితో పాటు పారిశ్రామిక

మిగతా 6వ పేజీలో...

- సేద్యానికి చేయూత కోసం రైతన్నల నిరీక్షణ
- మెరుగైన విద్య, వైద్య సేవలు కల్పించాలి
- నేడు జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక
- అభివృద్ధి వరాలు కురిపించేనా..?

నేడు బడిలో పండుగ

● సీఎం కొత్తచెరువుకు రాక ● పాఠశాల, కళాశాలల్లో మెగా పీటీఎం


సీఎం సమావేశానికి సిద్ధమైన సభావేదిక

● జిల్లాలో 2,516 పాఠశాలల్లో సమావేశాలు
● తల్లిదండ్రులు, విద్యార్థులతో సీఎం, విద్యాశాఖ మంత్రి భేటీ
● 'తల్లి పేరుతో మొక్క'కు శ్రీకారం

కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిరక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిన పెడుతోంది. బడుల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసేందుకు ప్రతి ఏటా ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా చర్యలు చేపట్టింది. సమష్టి కృషితో బడుల్లో నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతం చేయడానికి దోహదపడేలా మెగా పీటీఎం-2 కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. జూనియర్ కళాశాలలో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మాధవి, ఆమె పిల్లలు పి.బాలు (ఎనిమిదో తరగతి), నరసమ్మ (ఏడో తరగతి), బేబీ (ఐదో తరగతి), సన (మూడో తరగతి)తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 20 మంది, వారి తల్లిదండ్రులతో ఇష్టాగోష్ఠిలో పాల్గొంటారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్స్, తాడు లాగడం వంటి ఆటల పోటీల్లో పాల్గొంటారు. బహిరంగ సభలో మెగా పేరెంట్స్ సమావేశం

మిగతా 6వ పేజీలో...

ముఖ్యమంత్రి పర్యటనకు

కట్టుదిట్టమైన భద్రత

● పోలీసులు అప్రమత్తంగా ఉండాలి ● ఎస్పీ రత్న ఆదేశాలు


మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటనకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం బందోబస్తుపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు హుస్సేన్‌పీరా, ఇలియాజ్ అహ్మద్, డీఎస్పీలు విజయ్‌కుమార్, నరిసింగప్ప, శివనారాయణస్వామి, కేవీ మహేష్, హేమంత్‌కుమార్, మహబూబ్‌బాషా, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీఐలు, ఏఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మంత్రి

సత్యకుమార్‌యాదవ్ పాదయాత్ర

ధర్మవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 11 నుంచి మూడు రోజులపాటు పట్టణంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ పాదయాత్ర చేపడుతున్నారని పేర్కొన్నారు. శివానగర్ శివాలయం వద్ద నుంచి మంత్రి పాదయాత్ర ప్రారంభిస్తారని అన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలను నేరుగా కలిసి తెలుసుకుంటారని వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

పుట్టపర్తిలో

కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

పుట్టపర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పుట్టపర్తికి వచ్చారు. బుధవారం రాత్రి పుట్టపర్తి శాంతిభవనం వద్ద ఆయనకు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ స్వాగతం పలికారు.

నేడు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు రాక

పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్రంలో పంటల సాగు దక్షిణాంధ్రప్రదేశ్ కరువు పరిస్థితిపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించే కరువు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం జిల్లాకు రానున్నారు. కేంద్ర మంత్రితోపాటు అచ్చెన్నాయుడు పంటల సాగు దక్షిణాంధ్రప్రదేశ్ కరువు పరిస్థితి సమీక్షలో పాల్గొంటారు.

జాయింట్ కష్టాలు..!

● పరిష్కారం చూపలేకపోతున్న రీసర్వే
● హద్దుల వివాదంతో ఎల్‌పీఎంల నమోదు
● రైతుల గగ్గోలు
● ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే ముడుపులు
● పైలెట్ గ్రామాల్లోనూ పూర్తికాని దుస్థితి



అనంతపురం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం చేపడుతున్న రీ సర్వేలో ఆ సమస్య తీవ్రత మరింత పెరుగుతోందే తప్ప.. పరిష్కారం కావడం లేదు. వైసీపీ హయాంలోనూ రీసర్వే చేశారు. మండలంలో నాలుగైదు గ్రామాల కంటే ఎక్కువ పూర్తి చేయలేకపోయారు. భూసమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోక అలాగే ఉండిపోయాయి. ఇప్పుడూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా పక్క పక్కనే ఉన్న రైతుల పొలాల హద్దులు, మిగులు భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చాలాభూముల విషయాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు వేసి చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో వాటిని పరిష్కరించుకోలేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని చోట్ల సబ్ డివిజన్‌కు, ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి కొందరు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు ముడుపులు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కాగా నెలలు దాటుతున్నా ఇప్పటికీ అధిక శాతం మండలాల్లో ఒక గ్రామంలో కూడా రీసర్వే పూర్తికాని దుస్థితి నెలకొంది. దీంతో భూముల సమస్యల పరిష్కారానికి ఎంతకాలం వేచి చూడాల్సి వస్తుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది.

ఇవీ సమస్యలు...

భూముల విషయంలో రైతులు పరిష్కారం కాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. రీసర్వే చూస్తే మాత్రం ఒక్క ఊరిలో కూడా పూర్తిగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. జిల్లాలోని విడపనకల్లు మండలం ఉండబండలో రీసర్వే చేస్తున్నారు. ఈ గ్రామ పరిధిలో మొత్తం 350సర్వేనంబర్లున్నాయి. అందులో 175 సర్వే నంబర్లలో భూసమస్యలు, వివాదాలున్నాయి. 70 సమస్యలు అన్నదమ్ముల మధ్య వివాదం, పొలం హద్దు విషయాల్లో ఉన్నాయి. 20 సమస్యల్లో భూముల్లో తేడా ఉంటోంది. ఆన్‌లైన్‌లో రైతు పేరిట రెండెకరాలు ఉంటే, సాగులో 1.70 ఎకరాలు ఉంటోంది. మరో పది సమస్యల్లో సాగులో (మిగతా 6వ పేజీలో...)

భారతీయ సంస్కృతి
మహోన్నతమైనది
రాజస్థాన్ గవర్నర్
హరిబాబు కిషన్‌రావు
(వివరాలు 6లో..)

అయ్యో.. చంద్రప్ప..!
» సెంటు భూమిలేని కూలీ 300 ఎకరాలకు ఆసామి
(వివరాలు 6లో..)



హిందూపురంలోని బాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణ

నేడు గురుపూర్ణిమ

● ముస్తాబైన బాబా మందిరాలు ● ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

పుట్టపర్తిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమకు జిల్లావ్యాప్తంగా బాబా మందిరాలు ముస్తాబయ్యాయి. గురువారం గురుపూర్ణిమ పురస్కరించుకుని పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతినిలయం విద్యుద్దీపాల వెలుగుల్లో మిరుమిట్లు గొలుపుతోంది. వేడుకలకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హాజరుకానున్నారు.



ముస్తాబైన సత్యసాయి మహాసమాధి

విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు

కదిరి, జూలై9(ఆంధ్రజ్యోతి): సాధారణంగా విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు మంజూరు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు అందిస్తోంది. మెగా పీటీఎం సందర్భంగా ప్రతి విద్యార్థికి రెండునుంచి మూడు మొక్కలు పంపిణీ చేస్తారు. వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ పాస్‌పోర్టును కూడా అందిస్తోంది. అందులో విద్యార్థి ఫొటో, అపార్ ఐడీ, పాఠశాల యూడైస్ కోడ్, విద్యార్థి పేరు వివరాలు పొందుపరిచారు. తరువాతి పేజీలో




గ్రీన్ పాస్‌పోర్ట్ కవర్ పేజీ

మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం ఉంటాయి. మొక్కను పెంచే తీరు బట్టి గ్రీన్ పాయింట్స్‌కూడా ఇస్తారు. దీనిని ధ్రువీకరిస్తూ ఉపాధ్యాయులు సంతకం చేయాల్సి ఉంటుంది. ఇలా మూడేళ్లపాటు మొక్క పెరిగే స్థాయి, ఎత్తు, తదితరాలను నమోదు చేస్తారు. మొక్కలు పెంచడం ద్వారా విద్యార్థులకు పర్యావరణం, తదితర అంశాలపై అవగాహన కలుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గ్రీన్‌పాస్‌పోర్టు ద్వారా విద్యార్థులకు మొక్కల పట్ల బాధ్యత, జవాబుదారీతనం పెరుగుతున్నాయంటున్నారు.

ఆశల ఊసులు..!

(5వ పేజీ తరువాయి)

హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఏపీఐఐసీ ద్వారా అనేక మౌలిక వసతులు ఏర్పాటు చేయించారు. ఈనేపథ్యంలో కర్ణాటకతో పోలిస్తే జిల్లాలో భూముల ధరలు తక్కువగా ఉండటం, హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో నీటికి ఇబ్బంది లేకపోవడం, మెరుగైన రహదారులు ఉండటంతో పారిశ్రామికవేత్తల చూపు జిల్లా పడింది. మరిన్ని పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.



లేపాక్షి టెంపుల్ వ్యూ

35వేల ఎకరాల భూసేకరణ

జిల్లాలో ఇప్పటికే ఐదు పారిశ్రామిక హబ్‌ల ఏర్పాటుకు 35వేల ఎకరాల భూ సేకరణకు వేగం పెంచారు. జిల్లాలో రూ. 11920 కోట్ల పెట్టుబడులతో రెండు ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు ఏర్పాటుకు ముందుకు రాగా 4130 మంది ఉపాధి అవకాశం కల్పించే ప్రాజెక్టులు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. జిల్లాలో బొండాడ ఇంజనీరింగ్ సంస్థ 2000 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈప్రాజెక్టును రూ. 9000 కోట్ల పెట్టుబడితో 3900 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఏర్పాటు చేయనున్నారు. గత ఏడాది నుంచే జిల్లాలో 41 పరిశ్రమలకు 1056 ఎకరాల భూముల కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 8678 ఎంఎస్‌ఎంఈలతో 54847 మందికి, 48 మధ్య తరహా పరిశ్రమలతో 25682 మందికి, 18 భారీ పరిశ్రమలతో 65వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధి లభిస్తోంది. ఉమ్మడి జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ఉపాధి కోసం జిల్లాకు క్యూకట్టారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం మరింత ఊతమిస్తే పారిశ్రామికంగా జిల్లా మరింత దూసుకెళ్లడం తథ్యం.

నీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

జిల్లాలో ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువ గట్టుకు ఇరువైపులా లైనింగ్ కోసం రూ. 930.70 కోట్లు కేటాయించింది. వందరోజుల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంతో 230 కిలోమీటర్ల లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగు, సాగు నీరు అందించేందుకు మడకశిర ఉప కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. మడకశిర ఉపకాలువ వెడల్పు, లైనింగ్‌తోపాటు హంద్రీనీవా బైపాస్ కెనాల్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. పుట్టపర్తి నియోజకవర్గానికి సాగునీరిచ్చే 193 చెరువుల ఎత్తిపోతల పనులు వేగం పెంచాలి. రాప్తాడు నియోజకవర్గానికి సాగు నీరు అందించేందుకు హంద్రీనీవా కింద గత వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను నిర్మించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ముదిగుబ్బ మండలంలో చేపట్టిన జిల్లేడుబండ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆ మండల ప్రజలు కోరుతున్నారు.


సమగ్ర వ్యవసాయ అభివృద్ధి కోసం..

ఇది 42 రకాల ఉద్యాన పంటల సాగుకు అనుకూలమైన జిల్లా. టమోటా, మామిడి, అరటి, దానిమ్మ, పంటలు ఎగుమతుల్లో జిల్లాకు అగ్ర స్థానం లభించింది. అయితే కొన్నేళ్లుగా అతి వృష్టి, అనావృష్టితో ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాల్సి ఉంది. జిల్లాలో ఎక్కువ శాతం వర్షాధార భూములున్న నేపథ్యంలో హంద్రీనీవా పథకాన్ని పొడిగించి మరిన్ని రిజర్వాయర్లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. రైతుకు చేయూత ఇచ్చే పథకాలను అందించి, వ్యవసాయాన్ని పండుగలా చేయాలని కోరుతున్నారు. కాగా జిల్లా యువతకు సమగ్ర నైపుణ్య శిక్షణ ఇప్పించాలని, లేపాక్షి నాలెడ్జి భూములకు బంధ విముక్తి కల్పించాలని జిల్లా ప్రజలు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

విద్య, వైద్యం, టూరిజం అభివృద్ధిపై ఆశలు

ఉన్నత విద్య కోసం జిల్లాలోని విద్యార్థులు ఉమ్మడి అనంతతోపాటు ఇతర జిల్లాలకు పరుగులు పెటాల్సి వస్తోంది. మెరుగైన వైద్యం కోసం కూడా ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ఉన్నత విశ్వవిద్యాలయాలతోపాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేసి మూడేళ్లు దాటినా పక్కా భవనాలు లేక పరాయి పంచనే పాలన సాగిస్తోంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. ప్రాచీన కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి అందాలకు నెలవైన జిల్లాలో టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా చేసి పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేపట్టాయి. దీన్ని సఫలం చేసి ఎయిర్ కనెక్టివిటీని పెంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అమరాపురంలో వక్క మార్కెట్ ఏర్పాటు చేయాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..



కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తచెరువు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆయన గురువారం ఉదయం 8 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 8-10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 8-15 గంటల బయలుదేరి 9 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరతారు. 9-10 గంటలకు అక్కడి నుంచి బయలు దేరి రోడ్డు మార్గాన 9-25 గంటలకు కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తారు. 9-30 నుంచి 9-55 గంటల వరకు తల్లి, పిల్లలతో సంభాషణ కార్యక్రమం ఉంటుంది. 9-55 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు నడిచి వెళతారు. ఒంటి గంట వరకు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఒంటి గంటకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు కాలినడక వెళ్లి అక్కడి నుంచి 1-10 గంట ప్రశాంతి నిలయం చేరుకుంటారు.

1-15 గంటల నుంచి 2-15 వరకు ప్రశాంతి నిలయాన్ని సందర్శిస్తారు. 2-15 గంటలకు ప్రశాంతి నిలయం నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 2-35 గంటలకు విజయవాడకు విమానంలో బయలు దేరివెళతారు.

నారా లోకేశ్ షెడ్యూల్..

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి పుట్టపర్తి మండలం కప్పలబండ వద్ద ఏర్పాటు చేసిన విడిది కేంద్రానికి చేరుకున్నారు. గురువారం ఉదయం 9-15 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 9-30 గంటలకు చేరుకుంటారు. 10 గంటల నుంచి 2 గంటల వరకు మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం తిరిగి విజయవాడకు బయలుదేరి వెళతారు.

నేడు బడిలో పండుగ



తల్లికి వందనం పథకం లబ్ధిపొందిన పిల్లలతో తల్లి

(5వ పేజీ తరువాయి)

జరుగుతుంది. తరువాత ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 120 మందితో సహపంక్తి భోజనాన్ని చేయనున్నారు. ఇందులో 40 మంది ఉపాధ్యాయులు, 40 మంది బాలికలు, 40 మంది బాలురు ముఖ్యమంత్రితో సహపంక్తి భోజనాలు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2,516 ఉండగా ఇందులో 2,19,638 మంది విద్యార్థులు చదువుతున్నారు.

తల్లి పేరుతో ఒక మొక్క

తల్లిపేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మాకే నామ్) నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి విద్యార్థి నాటి పెంచేందుకు అవసరమైన మొక్కలను పంపిణీ చేయనున్నారు. వాటిని విద్యార్థులు ఇంటి వద్ద లేదా పాఠశాల్లో నాటి సంరక్షించాల్సి ఉంటుంది. ఇందుకు గాను విద్యార్థులకు గ్రీన్‌పాస్‌పోర్టు విద్యాశాఖ అధికారులు ఇస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మొక్కను పరిశీలించి విద్యార్థులకు గ్రేస్ పాయింట్లు కేటాయిస్తారు.

నేటి మధ్యాహ్న భోజన మెనూ ఇదే..

ప్రభుత్వ పాఠశాలలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో భాగంగా గురువారం మెనూ ప్రకారం.. వెజిటబుల్ రైస్, పలావ్, బంగాళ దుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, రాగి జావా విద్యార్థులకు అందించనున్నారు. ఈ ఆహార పదార్థాలను విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భుజించనున్నారు.

విద్యార్థుల ప్రగతిపై ప్రోగ్రెస్ కార్డులు

మెగా పేరెంట్ టీచర్ సమావేశం జరిగే రోజునే తమ పిల్లలు పాఠశాలల్లో విద్యలో ఎలా ఉన్నారు, వారి ప్రవర్తనశైలిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదువులో పాటించాల్సిన నియమాలను ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తారు. ఎస్ఎస్ఏ ద్వారా ముద్రించిన కార్డులను ఇవ్వనున్నారు. విద్యార్థులు ఏ రంగంలో మక్కువ చూపుతున్నారు, ఆరోగ్య పరీక్షలు, పిల్లలు ఇళ్ల వద్ద ఎలా చదువుతున్నారు వంటి విషయాలతో పాటు తల్లిదండ్రుల అభిప్రాయాలను ఈ కార్డుల ద్వారా పంచుకోనున్నారు.

నలుగురు పిల్లలకు తల్లికి వందనం

ప్రభుత్వం అందించిన తల్లికి వందనం పథకం కింద నలుగురు పిల్లలకు కలిపి రూ.52వేలు ఖాతాలో జమ అయింది. నా పిల్లలు బాలు 8వతరగతి, నరసమ్మ 7వతరగతి, బేబి 5వతరగతి, సన 3వ తరగతి చదువుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మా పిల్లల్లో ఒకరికి మాత్రమే అమ్మఒడి నగదు జమ అయింది. ప్రస్తుతం నలుగురు పిల్లలకు నగదు జమ కావడం ఆనందంగా ఉంది. మా లాంటి పేద కుటుంబాలకు ఈ నగదు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ డబ్బును పిల్లలకు చదువులకు ఉపయోగిస్తున్నా.

-మాధవి, తల్లి, కొత్తచెరువు

బడులు తెరవగానే పుస్తకాల పంపిణీ

బడులు తెరవగానే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం అందించింది. జిల్లా వ్యాప్తంగా 12,26,760 పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు 8,39,762, డిక్షనరీలు 27,987, బ్యాగులు 1,39,948, షూలు 1,40,241, యూనిఫామ్ మూడుజతలు 1,39,948 మందికి, బెల్టులు 98,764 మందికి పంపిణీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు అందక ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే.

భారతీయ సంస్కృతి మహోన్నతమైనది





మహాసమాధిని దర్శించుకుంటున్న రాజస్థాన్ గవర్నర్, సత్కరిస్తున్న రత్నాకర్

పుట్టపర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి మహోన్నతమైనదని రాజస్థాన్ గవర్నర్ హరిబాహు కిషన్‌రావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి మానవతా విలువలపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజస్థాన్ గవర్నర్ జ్యోతి వెలిగించి, సదస్సును ప్రారంభించారు. గవర్నర్ ప్రసంగిస్తూ.. సనాతన ధర్మం శాశ్వతమైందన్నారు. సనాతన ధర్మాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకుని, సేవాభావంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఆత్మతత్వంలోనే పరమాత్మం ఉందనీ, మానవసేవే ఈశ్వర సేవ అని అన్నారు. సత్యసాయిబాబా ఈ భావనతోనే సేవా కార్యక్రమాలు కొనసాగించారన్నారు. సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు కోట్లాది మంది ప్రజలకు జీవిత పరమావధిగా మారాయన్నారు. సత్యసాయి.. పేదలకు అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీటి సేవలు అనన్యమైనవని కొనియాడారు. సత్యసాయి చూపిన విలువలతో కూడిన విద్యనభ్యసించి సమాజ హితం కోసం జీవన గమనాన్ని సాగించాలంటూ పేర్కొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు రాజస్థాన్ గవర్నర్‌కు, రాజ్యసభ సభ్యుడు భగవత్ ఖరద్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్వాగతం పలికి, సన్మానించారు. రామకృష్ణ మిషన్ వీసీ స్వామి సర్వోత్తానంద, సేవాదళ్‌జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే సత్యసాయి మానవతా విలువలపై ప్రసంగించారు. సత్యసాయి విద్యార్థులు బ్యాండ్ మేళం, మంగళవాయిద్యాలతో అలరింపజేశారు. వేడుకల్లో సెంట్రల్ ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానంద, యూనివర్సిటీ వీసీ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యో..! చంద్రప్ప





చంద్రప్ప ఆధార్‌కి లింకైన అన్‌సెటిల్డ్ భూముల జాబితా

- సెంటు భూమిలేని కూలీ 300 ఎకరాలకు ఆసామి
- 'తల్లికి వందనం'తో బయట పడిన రెవెన్యూ లోపాలు
- పథకం అందక లబోదిబోమంటున్న నిరుపేద కూలీ



చంద్రప్ప

చిలమత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆయన్ను చూస్తే అందరూ కూలీ అనుకుంటారు. ఆయన కూడా అలాగే అనుకుని ప్రతి రోజూ కూలి పనులకు వెళ్తాడు. కానీ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆయన 300 ఎకరాలకు ఆసామి. ఇంత పెద్ద భూస్వామికి సంక్షేమ పథకాలు ఎందుకని ప్రభుత్వం ఆపేసింది. దీంతో రెక్కాడితేగాని డొక్కాడని తనకు ఇంత భూమి ఉన్నట్లు కనీసం కల కూడా రాలేదని ఆ కూలీ వాపోతూ తహసీల్దార్‌ను కలిశాడు. అరెరే పొరపాటు జరిగిందే అని ఆ అధికారి సైతం నాలుక్కరుచుకున్నాడు. అధికారులు చేసిన పొరపాటుకు తాను ప్రభుత్వ పథకాలు కోల్పోతున్నట్లు ఆ కూలీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆ కథా కమామిషు ఇలా..

చిలమత్తూరు మండలంలోని శానగానపల్లికి చెందిన చంద్రప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విష్ణు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె కేజీబీవీలో పదోతరగతి చదువుతోంది. ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకానికి వారు ఇద్దరు అర్హులు. అయితే ఇద్దరికీ ఆ పథకం వర్తించలేదు. దాంతో అతడు సచివాలయంలో గ్రీవెన్స్ ఫిర్యాదు చేశాడు. చంద్రప్ప ఆధార్ నంబర్‌కి చాగలేరు రెవెన్యూ పొలంలోని సుమారు 300 ఎకరాలకు పైగా అన్‌సెటిల్‌గా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములు లింక్ అయ్యి ఉన్నట్లు సచివాలయ అధికారులు తెలిపారు. దీంతో ఆయన తనకు సెంటు భూమి కూడా లేదని, మూడు వందల ఎకరాలు ఎలా వచ్చాయని నేరుగా తహసీల్దార్ నటరాజ్‌ని కలిసి ప్రశ్నించాడు. రికార్డులను పరిశీలించిన తరువాత తహసీల్దార్ కూడా షాక్ అయ్యాడు. సాంకేతిక కారణాలతో ఇలా జరిగిందని, దానిని సరిచేస్తామని అతడికి హామీ ఇచ్చారు. తనకు లేని భూమిని ఉన్నట్లుగా చూపి తల్లికి వందనం పథకం అందకుండా చేశారని చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై తహసీల్దార్ నటరాజు మాట్లాడుతూ సాంకేతిక సమస్యతో అలా జరిగి ఉంటుందని, అందుకోసం టెక్నీషియన్‌తో మాట్లాడి బాధితుడు చంద్రప్ప ఆధార్‌కు లింక్ చేసిన భూములను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డ్రిప్ త్వరగా మంజూరు చేయాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పీడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డ్రిప్ కంపెనీల డీసీఓలు, ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గత ఆర్థిక సంవత్సరంలో పెండింగ్‌లోని డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను ఈనెల 20వతేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాల మంజూరు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. పరికరాలు అవసరమైన అర్హులైన రైతులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించడంతోపాటు కొత్త మార్గదర్శకాల మేరకు నాన్‌సబ్సిడీ మొత్తాన్ని చెల్లించేలా ప్రత్యేక చొరవ చూపాలని వివరించారు.

15న హంద్రీనీవాకు నీటి విడుదల

- కొలిక్కివచ్చిన వెడల్పు పనులు
- సీజన్ తరువాత లైనింగ్ పనులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై9(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాకు ఈనెల 15న మల్యాల పంప్‌హౌస్ వద్ద శ్రీశైలం డ్యాం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయనున్నట్లు జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజ తెలిపారు. మల్యాల వద్ద 12 పంపుహౌస్‌లకు 3,850 క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. 15వ తేదీన రెండు పంపుహౌస్‌ల నుంచి 600 క్యూసెక్కుల నీటిని వదలనున్నారు. రెండు మూడు రోజుల తరువాత మిగిలిన పంపుహౌస్‌ల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వదిలేలా ప్రణాళికలు చేసుకున్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు జిల్లాలో కొలిక్కి వచ్చాయని, 15లోపు పూర్తి చేయనున్నట్లు సీఈ తెలిపారు. 15న మల్యాల వద్ద నీటిని విడుదల చేస్తే..18న జిల్లా సరిహద్దు రాగులపాడుకు చేరుకుంటాయని వివరించారు. మిగిలిన లైనింగ్ పనులు సీజన్ తరువాతే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది 50టీఎంసీల వరకు హంద్రీనీవాకుకేటాయించినట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.

జాయింట్ కష్టాలు..!

(5వ పేజీ తరువాయి)

ఒకరుంటే ఆన్‌లైన్‌లో మరొకరి పేరుంది.

జాయింట్ ఎల్‌పీఎం ముసుగులో వసూళ్లు...

రైతుల భూముల హద్దుల విషయంలో తేల్చకుండా వాటిని జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్(ఎల్‌పీఎం)లో పెట్టేస్తున్నారు. అలా చేయడంతో సంబంధిత రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్విట్ ద్వారా మార్చమని అడిగితే ఆప్షన్ లేదని, ఆన్‌లైన్ సహకరించడంలేదని చెబుతున్నారట. జాయింట్ ఎల్‌పీఎం చేశాక తొలుత సంబంధిత రైతులకు నోటీసులిస్తారు. అనంతరం ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్ చేసి జాయింట్ ఎల్‌పీఎం నుంచి వేరు చేస్తారు. ఈ వ్యవహారం చేయడానికి ధరలులేని భూముల్లో రూ.5వేల నుంచి రూ.20వేల వరకు, ధరలున్న ప్రాంతాల్లో రూ.50వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. మిగులు భూములతో పాటు సాగులో ఒకలా, పుస్తకంలో మరోలా ఉంటుంది. అలా భూమిలో తేడా ఉన్నపుడు సాగులో ఎవరుంటే వారికి చేయాలనే నిబంధన ఉంది. వాటికి కూడా జాయింట్ ఎల్‌పీఎం పేరిట చేస్తున్నారట. దీంతో అలా డబ్బులు ఇచ్చుకోలేని వారు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేస్తున్నారు.

ఫీల్డ్‌కు వెళకుండా.. రెవెన్యూలో జోక్యం..

ప్రస్తుతం రీ సర్వేలో డిప్యూటీ తహసీల్దార్‌గా చలామణి అవుతున్న వారందరూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) స్థాయి ఉద్యోగులే. వైసీపీ హయాంలో 2022 డిసెంబరులో రీసర్వే పేరుతో ఆర్ఐలను అడ్‌హక్ హోదాతో డీటీలుగా చేశారు. మరోసారి 2024లో ఎక్స్‌టెన్షన్ చేసుకున్నారు. వీరి ఆధ్వర్యంలోనే రీ సర్వే కొనసాగుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలో రామగిరి మండలంలో తహసీల్దార్ లేకపోవడంతో రీసర్వే డీటీకి తహసీల్దార్‌గా ఇచ్చారంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థమవుతుంది. వారిలో చాలామంది క్షేత్రస్థాయిలో భూములు పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. విలేజ్ సర్వేయర్లతో సర్వే పనులు చేయించి, కేవలం రికార్డులు తిరగేసి వ్యవహారం నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. వీరిలో కొందరు రెవెన్యూ పనుల్లో జోక్యం చేసుకుంటున్నారట. చుక్కల భూములు, 22ఏ, వెబ్‌ల్యాండ్ కరెక్షన్, ఆర్ఓఆర్ అప్పీళ్లు, ల్యాండ్ కన్వర్షన్, వివాదాలున్న భూముల విషయంలో తలదూర్చి పైసలు వసూలు చేస్తున్నారని సమాచారం.



వసూళ్లలో ముదుర్లు

కొందరు డీటీలు, సర్వేయర్లు రీసర్వే ముసుగులో బాగా ముదిరిపోయారట. గుంతకల్లు నియోజకవర్గంలోని ఓ మండలంలో 9నెలలుగా రీసర్వే డీటీగా చేసి తాజాగా మరో మండలానికెళ్లిన అధికారి రూ.కోట్లకు పడగలెత్తారట. ఈ మధ్యనే ఓ కారు కొనుగోలు చేశారట. ఆ మండలంలోని ఓ రైతుకు చెందిన 35 సెంట్ల మిగులు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి రూ.5లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. 'నాకేమైనా భూమి అమ్ముతున్నారా..? అంత డబ్బు ఇవ్వలేను.. మీరే తీసేసుకోండి' అంటూ ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడట. ఓ రీసర్వే డీటీ కలెక్టరేట్‌లో పోస్టు ఇప్పించుకున్నారు. అక్కడ ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు పౌరసరఫరాల శాఖకు బదిలీ చేశారు. విలేజ్ సర్వేయర్లు సైతం సబ్ డివిజన్ వ్యవహారంలో బాగానే ముడుపులు పుచ్చుకుంటున్నారని తెలిసింది. ఆన్‌లైన్‌లో ఎక్కించే విషయంలోనూ, రెవెన్యూ సంబంధిత వ్యవహారాల్లో పైసలు లేనిదే పనిచేయరనే స్థాయికి వచ్చారు. రీ సర్వే జరిగిన భూముల్లో కొన్ని పట్టా ల్యాండ్‌లుగా ఉన్న వాటిని డీ పట్టా అని పెడుతున్నారనే విమర్శలున్నాయి. వీటిని వెబ్‌ల్యాండ్ కరెక్షన్ చేయాలంటూ మరో రూ.60 వేలు రైతులు ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మళ్లీ ఇక్కడ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి వాళ్లకు డబ్బు సమర్పించుకోవాల్సిందే.

ఆ పాపం ఇంకా...

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో గత వైసీపీ హయాంలో జరిగిన ఘనకార్యంతో ఓ రైతు ఇంకా తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఓబుళాపురానికి చెందిన మోహన్‌కు 8 ఎకరాల భూమి ఉంది. రీసర్వేలో ఆ భూమికి 4 రోడ్డు పాయింట్లు చూపారట. అలా జాయింట్ ఎల్‌పీఎం పెట్టడం ద్వారా ఆయన భూమికి విలువ తగ్గిపోయింది. ఈ విషయంలో అప్పటి అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఫోన్‌పే చేసిన ఆధారాలతో ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేకపోయింది. అలా వేరు చేసుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారట. ప్రస్తుత అధికార పార్టీలో నలుగురు ఎమ్మెల్యేలు తెలిసినా ఆయన సమస్య పరిష్కరించుకోలేక పోతున్నారట. అదే సమయంలో ఆయన ఇంటికి సంబంధించి గతంలో ఉన్న సర్వేయర్లు రోడ్డు విషయంలో ఇల్లు తప్పిపోతుందని సర్వే ఇస్తే... ఆ తరువాత ఓ వ్యక్తి రోడ్డు విస్తరణలో ఇల్లు సగం కట్ అయ్యేలా రిపోర్ట్ ఇచ్చారట.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సీఐటీయూ నాయకులు ● నిరసన ర్యాలీలు



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దేశ వ్యాప్తంగా కార్మికులకు నష్టం కల్గించే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చేపట్టిన ర్యాలీలో సీఐటీయూ, సీపీఎం, రైతు సంఘం నాయకులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పట్టణ ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సత్యసాయిజిల్లా వాటర్ వర్క్స్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, కార్మికులు బొగ్గునాగరాజు, జయ, అనిల్, బాబు, శ్రీనివాసులు, నరసింహులు కోటి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కదిరి పట్టణంతో పాటు మండలకేంద్రాలైన బత్తలపల్లి, తాడిమర్రి, కొత్తచెరువు, ముదిగుబ్బ, కదిరి, అమడగూరు, గాండ్లపెంట, నల్లమాడ, నంబుల పూలకుంట, ఓబుళదేవరచెరువు, తలుపుల, నల్లచెరువు, తనకల్లులలో నిరసన ర్యాలీలు నిర్వహించారు.

ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి

● ధర్మవరంరూరల్: కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఐ చేతివృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు, పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుడగ వెంకటనారాయణ, గుర్రం వెంకటస్వామి, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పీరు ఊరేగింపు

కదిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని ఓదుల పల్లిలో మొహర్రం సందర్భంగా ఉరుసు పీరును బుధవారం ఊరేగించారు. పీర్ల చావిడి నుంచి గ్రామంలో ఊరేగించారు. గ్రామ పెద్దలు శంకర్‌రెడ్డి, ముజావర్లు ఫక్కీరప్ప, నాగరాజు, నడిపి సిద్దయ్య, ఆవుల నాగరాజు, ఫక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.



ఓదులపల్లిలో ఊరేగుతున్న ఉరుసు పీరు

చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు ఇంట్లో ఉన్న చదుకునే విద్యార్థులందరికి తల్లికి వందనం పథకం కింద వారి తల్లుల ఖాతాలో రూ. 13 వేలు జమచేశామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అమగొండపాళ్యం, ఎనుమలపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు అందించిన అభివృద్ధి సంక్షేమపథకాలను తెలియజే స్తూ కరపత్రాలను అందచేశారు. తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి పొందిన విద్యా ర్థుల తల్లితండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వా రు మాట్లాడారు. వైసీపీ పాలనలో జగన్ ఐదేళ్లు విధ్వంసకర పాలన సాగించారన్నారు. నియోజక వర్గంలోని కొత్తచెరువుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ వస్తున్నారని వారికి ఘనంగా స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలో టీడీపీ నాయ కులు, కార్యకర్తలు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమ గొండపాళ్యంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమా లకు అకర్షితులై గ్రామానికి చెందిన 25వైసీపీ కుటుంబాలు తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. యానాది శ్రీనివాసులు, జరిపోతుల నరసింహుడు, అవులపల్లి నరసింహుడు, మహేష్, మల్లికార్జున, గంగాధరమ్మ, వరలక్ష్మి, రాఘవయ్య, చినరాయుడు, హారిక, చంద్రకళ, శ్రీనివాసులుతో పాటు పలుకు టుంబాలు టీడీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కష్టపడేవారికి పార్టీ పదవులు

తెలుగుదేశంపార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కేటాయించిం దని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్కొ న్నారు. నియోజకవర్గంలో 14 సహకార సొసైటీ సంఘాలకు ప్రభుత్వం అధ్యక్షులను నియమించిందన్నారు. నూతనంగా పదవులు అలంకరించిన సొసైటీ అధ్యక్షులు ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. నామినేటెడ్ పదవులు పొందిన విజయ్‌కుమార్, వెంకట రాముడు, శ్రీరామిరెడ్డితో పాటు నాయకులు సామకోటి ఆదినారాయణ, రత్నప్పచౌదరి, పీసీ గంగన్న, గంగాధర్ నాయుడు, పుల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

చెరువును పూడ్చేస్తున్నారు..!

కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపంలోని నాగుల కనుమ సమీపంలో బుక్కపట్నం చెరువులోకి కొందరు వ్యక్తులు వృథామట్టిని గుట్టగుట్ట లుగా తోలారు. రోడ్డు పక్కన తోలడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యమంత్రి గురువారం రోడ్డు మార్గాన కొత్తచెరువుకు రానున్నారు. దీంతో అధి కారులు ఆ మట్టికుప్పలను ఎక్స్‌కవేటర్లతో ద్వారా తొలగించి మట్టిని చెరువులోకి తోలుతున్నారు. దీంతో చెరువును పూడ్చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చెరువులోకి మట్టిని తోలకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీఎల్‌డీఓ తనిఖీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటరత్నం

తనకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ రామానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ చేప డుతున్నారా లేదా అన్న విషయాలను స్వయంగా పరిశీలించారు. ఇందిరానగర్, తారక రామానగర్, కుమ్మర వీధుల్లో చెత్త సేకరణ చేపడుతున్న ప్రాంతాలకు వెళ్లి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడిచెత్త వేరువేరుగా ఉంచుకోవాలన్నారు. సక్రమంగా పనులు నిర్వహిం చాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యదర్శి, సిబ్బంది గ్రామస్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. వారితో పాటు పంచాయతీ కార్యదర్శులు క్రిష్ణమూర్తిరెడ్డి, ఉదయ్‌కుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఐదుగురికి కారుణ్య నియామకాలు

పుట్టపర్తి రూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): కార్మికుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కొనియాడారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో పనిచేస్తూ ఐదేళ్ల క్రితం మృతి చెందిన ఐగురు పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఆప్కాస్ సంస్థ ద్వారా ఒప్పంద పారిశుధ్య కార్మికులుగా నియమించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం లక్ష్మీదేవి, నాగలక్ష్మి, శివలీల, సాయికృష్ణ, రామాంజినేయులుకు కారుణ్య నియామకాల పత్రాలన్ను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్‌తో కలసి ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తూ ఐదేళ్ల కిందట మృతి చెందిన కుటుంబాలకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. తమ ప్రభుత్వంలో నియామకపత్రాలను అందజేశామని ఎమ్మెల్యే, మాజీ మంత్రి తెలిపారు.

న్యూస్ బాక్స్

19, 20 తేదీల్లో జ్ఞాన గాయత్రి మహాయజ్ఞం

ధర్మవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్ శివాలయం వద్ద ఈ నెల 19, 20వ తేదీలలో 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు ధర్మవరం గాయత్రి పరివార్, శివాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి కలశ శోభాయాత్రతో పాటు గాయత్రి దీప మహాయజ్ఞం చేపడుతామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన తాడిమర్రి నాయకులు



మాధవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాగార్జున

తాడిమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను ఆ పార్టీ మండల నాయకులు బుధవారం కలిశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్టు మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నాగార్జున, చిల్లా కాటమయ్య, ప్రకాశ్ పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని ఈ సందర్భంగా మాధవ్ పేర్కొన్నట్టు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



చౌటకుంటపల్లిలో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

నల్లమాడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంట పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నల్లమాడకు చెందిన పొరకల రమణ కుటుంబ సభ్యులు బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తమ సోదరి తమర్ల సరస్వతమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, వాటర్ బాటిల్, మిఠాయిలు అందించామని ఆయన తెలిపారు. ప్రతి యేటా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రమణ కుటుంబసభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు హేమావతి, ఉపాధ్యాయురాలు రోజా పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

నల్లచెరువు, జూలై9(ఆంధ్రజ్యోతి):మండలంలోని తమలర్లవాండ్లపల్లి పంచాయతీ గురోజనవాండ్లపల్లిలో టీడీపీ నాయకుడు విజయ్‌కుమార్(55) గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిం చారు. ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్ధాంతరంగా ఆగిన కళాశాల భవనం



బుక్కపట్నంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డిగ్రీ కళాశాల భవనం

బుక్కపట్నం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బుక్కపట్నంలో 2018లో ప్రారంభించిన నూతన డిగ్రీ కళాశాల భవననిర్మాణం అర్ధాంతరంగా గిపోయింది. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కళాశాల భవనానికి రూ.50లక్షల నిధులు మంజూరు చేసి నిర్మాణం పను లు ప్రారంభించారు. అదే సంవత్సరంలో మరో రూ.కోటి నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో 60శాతం భవనం పూర్తయింది. అనంత రం వైసీపీ అధికారంలోకి రాగానే నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. అప్పటి నుంచి నేటి వరకు నిధులు మంజూరుకాలేదు. నేడు జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ వస్తుండ డంతో తిరిగి డిగ్రీకళాశాల నిర్మాణం పునఃప్రారంభం అవుతుందని విద్యార్థులు, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధే ధ్యేయం

● శ్రీవారి ఆలయ అభివృద్ధి సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి అభివృద్ధిపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం తిరువీధుల్లోని నివాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ స్కీమ్ ద్వారా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు స్పెక్ట్రా సంస్థ ద్వారా డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆగమ శాస్త్రం ప్రకారం తిరువీధులను, కోనేరు (భృగుతీర్థ)ను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే కదిరి పరిసర ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు. దీంతో టెంపుల్ టూరిజం అభివృద్ధి చెంది, సంవత్సరానికి రూ. వందకోట్లు ఆదాయం ఉండేలా కృషి చేస్తామన్నారు. దీంతో కదిరి ప్రాంతంలో భక్తుల ద్వారా వ్యాపారాలు కూడా రూ. 500కోట్లుకు చేరుతుందన్నారు. వేలాదిమందికి ఉపాధి లభిస్తుందన్నారు. పురప్రముఖులు, తిరువీధుల నివాసితులు తమ బాధ్యతగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం స్పెక్ట్రా ప్రతినిధి ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గాండ్లపెంటకు చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈసమావేశంలో ఆర్డీవో వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు నరసింహచార్యులు, పార్థసారధి ఆచార్యులు, తిరువీధుల నివాసితులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

● కదిరి: తలుపుల మండలంలోని గుండువారిపల్లికి చెందిన ఉడమల కుర్తి అశోక్‌కుమార్‌కు సీఎం సహాయ నిధి కింద రూ.10లక్షలు మం జూరయ్యాయి. ఆ చెక్కును బుధవారం ఎమ్మెల్యే కందికుంట బాధి తుడి తండ్రి జయప్పకు పట్టణంలోని తన నివాసంలో అందజేశారు. దీంతో జయప్ప ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడక రామమోహన్, టీడీపీ నాయకుల జయచంద్ర తదిరతులు పాల్గొన్నారు. బాధితుడికి తక్షణ చికిత్స అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి'



టీఎన్‌పాళ్యంలో అభివృద్ధి పథకాలపై వివరిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడుతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని టీడీప మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ పేర్కొన్నారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలిఅ డుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మల్లేప ల్లి పంచాయతీ టీఎన్ పాళ్యం, ఆకుతోటపల్లి, మల్లేపల్లి, సిరిగారిపల్లి గ్రామా పర్యటించారు. కార్యక్రమంలో ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కోన రవీంద్ర, హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ హేమలతా భాయ్, వెంగముని రెడ్డి, అశోక్, బాసినేని హేమేంద్ర, చలమప్ప, సునీల్, ఐటీడీపీ రాజు, సోము, చిన్నరాములు, సూరి, ప్రసాద్, నారాయణస్వామి, వెంకట్‌రాముడు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సమస్యపై సీఎంను అడ్డుకుంటాం

● సాకే హరి

కొత్తచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడును కలవనీయకపోవడం అన్యాయని ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించినా అనుమతి ఇవ్వలేదన్నారు. దీనికి నిరసనగా బుధవారం కొత్తచెరువులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపా మన్నారు. తమకు అనుమతి ఇవ్వకపోతే ముఖ్యమంత్రిని అడ్డుకుంటామన్నారు. జేఏసీ నాయకులు రామాంజినేయులు, రవి, నారాయణ, శ్రీనివాసులు, నాగరాజు, శశిదర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక వాయిదా

ఓబుళదేవరచెరువు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక బుధవారం జరగాల్సి ఉంది. గురువారం సీఎం పర్యటన ఉండడంతో నిర్వహించ లేదని ఏపీఓ మంజుల తెలిపారు. తిరిగి ఎప్పుడన్నది త్వరలో ప్రకటిస్తామన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తనకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య కార్యక్రమం ద్వారా బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ జిల్లా అధికారి మేఘన మిషన్ వాత్సల్య గురించి వివరించారు. బాలల హక్కులు వివరించారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ బాలికల విద్య, ప్రభుత్వ పథకాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, టీనేజ్ ప్రెగెన్సీ, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహక నిరోధక చట్టం, మిషన్ వాత్సల్య బాలల హెల్ప్‌లైన్ 1098పై వివరించారు. అత్యవసర సమయంలో 100, 181, 121 1098 నంబర్లకు ఫోన్‌చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీమార్గరెట్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగభూషణం, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టమోటా వాహనం బోల్తా

● రోడ్డుపాలైన కాయలు



వాహనం బోల్తాపడడంతో చెల్లాచెదురుగా పడిపోయిన టమోటాలు

నల్లచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాత రైల్వే స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం టమోట వాహనం అదుపు బోల్తా పడింది. కదిరి మండలంలోని పందులకుంట గ్రామానికి చెందిన రంగారెడ్డి అనే రైతు 200 బాక్స్‌ల టమోటలను మొలకలచెరువుకు తరలిస్తున్నాడు. మండలంలోని పాత రైల్వేస్టేషన్ సమీపం వద్ద టైరు పంక్చర్ అవ్వడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. టమోటాలు రోడ్డుపాలయ్యాయి. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం టమోటాకు మంచి ధరలు ఉన్నాయని, ఈ సంఘటనతో ఆర్థికంగా నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

హామీల అమలు ఘనత చంద్రబాబుదే



ప్రజలకు కరపత్రం అందజేస్తున్న ఉమాదేవి

మడకశిర టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదిశగా అడుగులు వేస్తున్నారని, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని మారుతీనగర్, 17వ వార్డులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలకు వివరించారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మాజీ చైర్‌పర్సన్ రాధమ్మ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు సుభద్రనాగేంద్ర, మేఘన రమేష్, బలరాం, ఉమాశంకర్, ఓబులేసు, మాధవరాజు పాల్గొన్నారు.



రొద్దం: రాష్ట్రం దినదిన అభివృద్ధి సాధించేందుకు సీఎం చంద్రబాబు సుపరిపాలనతో సాధ్యమని టీడీపీ నాయకుడు మాధవనాయుడు మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య అన్నారు. బుధవారం ఎల్‌జీబీ నగర్, కందుకూర్లపల్లి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. చంద్రమౌళి, రామక్రిష్టప్ప, సిద్దన్న, ఉమాశంకర్, ఆంజనేయులు, కుల్లప్ప చౌదరి, నాగేంద్ర, శ్రీనివాసులు, హనుమన్న పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

పరిగి: కూటమి ప్రభుత్వం మొదలుపెట్టిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మండలంలోని పెద్దరెడ్డిపల్లిలో యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, సోమప్ప, లక్ష్మణ్‌రావు, జూలారెడ్డి, అక్కులప్ప, శివకుమార్, మంజునాథ్, రామాంజనేయులు పాల్గొన్నారు.



రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో బుధవారం సుపరిపాలన తొలి అడుగులో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తనయుడు సందేశ్ మోక్షజ్ఞ కార్యకర్తలతో కలిసి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు ఈరన్న, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, దాసిరెడ్డి, మారుతి, భరత్, ఇమ్మెగౌడ్, రాజన్న పాల్గొన్నారు.



సోమందేపల్లి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం టీడీపీ నాయకులు చేపట్టారు. పట్టణంలోని 139వ బూత్‌లో ప్రజలకు కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. కన్వీనర్ కిష్టప్ప, మహేంద్ర, సుబ్బు, చలపతి, మారుతి, వెంకటరమణ పాల్గొన్నారు.



హిందూపురం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే నెరవేరుస్తున్నామని నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని మలుగూరులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా యన హాజరయ్యారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

లేపాక్షి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదుగోళం గ్రామంలో మంగళవారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగిందని అదే గ్రామానికి చెందిన బోయ శాంతమ్మ, శ్యామల, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ఐదు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసుకుని బంధువుల గ్రామానికి వెళ్లగా గమనించి మంగళవారం రాత్రి తాళాలు పగులకొట్టి బీరువాలోని నగలు, నగదు దోచుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. శాంతమ్మ ఇంట్లో రూ.40వేలు నగదు, రెండు జతల కమ్మలు మాంగల్యం చైను, బేబి శ్యామల ఇంట్లో రూ.1.50 లక్షలు నగదు, నాలుగు జతల కమ్మలు, నాలుగు వెండి చైన్‌లు చోరీకి గురైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

హిందూపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో వ్యక్తిపై కత్తితో దాడిచేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి మండలం పోలేపల్లికి చెందిన నరసింహులు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు కత్తితో నరసింహులు తల, మొహంపై పొడిచాడన్నారు. ఆయన కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడ్డ నరసింహప్పను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

జయచంద్రకు సన్మానం



జయచంద్రను సన్మానిస్తున్న నాయకులు

గోరంట్ల, జూలై9 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం సింగల్‌విండో అధ్యక్షుడిగా నియమితులైన జయచంద్రను స్థానిక టీడీపీనాయకులు బుధవారం సన్మానించారు. చైర్మన్‌గా బెల్లాలచెరువు గ్రామానికి చెందిన జయచంద్రను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకులు అజంతుల్లా, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, ఉమాశంకర్, లక్ష్మీనర్సు గ్రామానికెళ్లి జయచంద్రను అభినందించి శాలువ, పూలమాలతో సత్కరించారు.

తీరనున్న పశువుల దాహం..!

- నీటి తొట్టెల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం
- పాడి రైతుల్లో ఆనందం

మడకశిర రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడి పరిశ్రమను పూర్తిగా విస్మరించిందిని పాడి రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 280 పశువుల నీటి



ఈచలేడ్డి గ్రామంలో పశువులకోసం నిర్మించిన నీటి తొట్టె

తొట్టెలు మంజూరయ్యాయి. అందులో మడకశిర మండలంలో 113, రొళ్ల 66, అగళి 52, అమరాపురం 39, గుడిబండ 10 నీటి తొట్టెలు మంజూరు. ఒక్కొక్కటి రూ. 34 వేలతో 280 నీటి తొట్టెలను నిర్మించారు. దీంతో పాడి రైతులు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో పాడి పరిశ్రమను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రైతులు అంటున్నారు. పాడి పశువుల తాగునీటి కోసం రైతులు పడుతున్న బాధలను గుర్తించిన కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద బోర్ల వద్ద పాడి తాగునీటి తొట్టెలను నిర్మించారు. వాటికి బోరునుంచి పైపులైన్ వేసి తొట్టెను ప్రతి రోజూ నీటితో నింపుతున్నారు.

ఎంతో సంతోషపడుతున్నాం: ప్రసాద్, బుడ్డేపాళ్యం



కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పాడి పశువులకు నీటి తొట్టెలు నిర్మించడం సంతోషించతగ్గ విషయం. వైసీపీ పాలనలో రైతుల గరించి పట్టించుకోలేదు. పశువులకు తాగునీరు కావలంటే దూరప్రాంతాల్లో ఉన్న చెరువులు, చెక్ డ్యాంల వద్దకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం గ్రామంలో ఎక్కడ తాగునీటి బోర్లు ఉంటే అక్కడ పశువులకు నీటి తొట్టెలను నిర్మించారు. కూటమి ప్రభుత్వం రైతులకు మరిన్ని సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం.

గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



గురుపౌర్ణమికి ముస్తాబైన ఆలయం

హిందూపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం గురుపౌర్ణమిని గురువారం జరుగనుంది. ఇందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని స్పర్శ దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని వివిధ సాయిబాబా ఆలయాల్లో పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పావగడ: తాలూకా వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కిరణ్, హనుమంతరాయప్ప తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సత్యనారాయణస్వామివ్రతం, అనంతరం వేడుకలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా సామూహిక సత్యవ్రతాలు



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

మడకశిర టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని షిర్డీసాయి ఆలయ ఆవరణంలో బుధవారం స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సామూహిక సత్యవ్రతాలను మహిళలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో మేళ తాళాలు, నృత్యాలతో ఊరేగించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: చైర్మన్



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

హిందూపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందితే కుటుంబాలు బాగుపడతాయని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజలి, సునీత, నాగేంద్ర, రహమత్‌బీ, నాగమణి, అయూబ్, నాయకులు నవీన్, డైమండ్ బాబా, అంజి పాల్గొన్నారు.

వీధిలైట్ల వితరణ

పెనుకొండ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ మంగాపురంలో 20వ వార్డు ఇన్‌చార్జి పోలీస్ నారాయణనాయక్, మాజీ సర్పంచ్ చంద్రకాంతమ్మ ఆధ్వర్యంలో మొహర్రం సందర్భంగా ఐదు లైట్లు వితరణ చేశారు. రూ.4వేలు విలువచేసే ఐదు ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలను పంచాయతీ సిబ్బంది ప్రసాద్‌కు అందజేసినట్లు తెలిపారు. మనోహర్‌నాయక్, అశ్వత్థనారాయణ, ఎలక్ట్రీషన్ వెంకటేశ్, నారాయణ నాయక్, మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు పురం క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో కోచ్

హిందూపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జట్టు ఎంపిక జరిగింది. ఇందులో ఫుట్‌బాల్ క్లబ్ మేనేజర్ శేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ సలీం పాల్గొని జోనల్‌స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు 11వ తేదీన మదనపల్లిలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

అన్నదాన కేంద్రం ప్రారంభం

రొద్దం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌జీబీ నగర్ గ్రామంలో నిత్యాన్న సమారాధన స్ఫూర్తి కేంద్రాన్ని టీడీపీ నాయకులు మాధవనాయుడు ప్రారంభించారు. బుధవారం గ్రామంలోని వీరబ్రహ్మ వెంకటార్య అవధూత ఆనంద గురు ఆశ్రమంలో నిత్యాన్నదాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఆశ్రమాన్ని నిర్వహిస్తూ నిరాశ్రయులకు ఆశ్రయమిస్తున్న ఆశ్రమం ఎంతో గొప్పదని కొనియాడారు. ప్రతిరోజూ నిత్యాన్నదానంతో సేవకు పునరంకితులు కావాలని స్వామీజీ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు టైలర్ ఆంజనేయులు, కేపీ శ్రీనివాసులు, బోయశ్రీనివాసులు, మాజీ డీలర్ శ్రీనివాసులు, హరి, శన్ముఖ, భక్తులు పాల్గొన్నారు.

నేడు మెగా పీటీఎం

పెనుకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నతపాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్ గురువారం ఉదయం నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి మంత్రి సవిత హాజరవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, హెచ్ఎం రాఘవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించిన దాతలు, పేరెంట్స్, టీచర్స్ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే చర్యలు

పెనుకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన తక్కువ మైక్రాన్ ఉన్న కవర్లు, గ్లాసులు ఇతర ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే అలాంటి దుకాణదారులపై కేసు నమోదుచేస్తామని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దర్గాసర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు చిల్లరదుకాణాలు, హోటళ్ల తనిఖీలు చేశారు. 3.6కేజీల ప్లాస్టిక్ వస్తువులను సేకరించి తగలబెట్టారు.

అన్నదాతా సుఖీభవకు 15,695 మంది అర్హులు

రొద్దం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవకు 16,695మంది రైతులు అర్హులుగా గుర్తించినట్లు వ్యవసాయాధికారి రాజేష్ తెలిపారు. 17,297మంది రైతులుండగా మృతిచెందినా ఒకే ఫ్యామిలీ కలిగిన రైతులు 1103 మంది ఉన్నారు. అనర్హత కలిగిన రైతులు 510మంది ఉన్నారన్నారు. ఇందులో ఎవరికైనా రాకపోతే 13వరకు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేసి అర్హులకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రొద్దం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంధాలయాన్ని జిల్లా అధికారి రమా తనిఖీ చేశారు. బుధవారం ఆమె గ్రంథాలయ రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ఆమె వెంట స్థానిక గ్రంథాలయాధికారి నాగరాజు ఉన్నారు.

నేతులపల్లిలో ముగ్గుల పోటీలు

పరిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేతులపల్లిలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు మహంతేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ఆవరణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గురువారం మెగా పేరెంట్స్ సమావేశం సందర్భంగా తగిన బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాల పరిశీలన

గుడిబండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంజేపీ జూనియర్ కళాశాలను తహసీల్దార్ శ్రీధర్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో అడిగి తెలుసుకున్నారు.

మెగా పీటీఎంకు ఆహ్వానం



తల్లికి బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న టీచర్లు

రొద్దం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో గురువారం జరిగే మెగా పేరెంట్స్ మీట్‌కు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు వినూత్న రీతిలో ఆహ్వానం పలికారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బోయవీధిలో తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి పసుపుకుంకుమ పెట్టి పూలు అందించి తప్పకుండా రావాలని ఆహ్వానించారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం మెగా పేరెంట్స్‌డేకు విచ్చేసి వారి విద్యాబుద్ధులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ఆర్.మరువపల్లిలో ఉపాధ్యాయులు గిరీష్‌కుమార్, లక్ష్మీనారాయణ ఇంటింటికీ వెళ్లి కార్యక్రమానికి రావాలని కోరారు. ఎంఈఓ జయశేఖర్, హెచ్ఎం నాగలక్ష్మి, రత్నమ్మ, గోకుల్, మల్లికార్జున పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాల్లో ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు సమావేశానికి మెగాపేరెంట్స్ డేకు హాజరు కావాలని ఆయా పాఠశాలల చైర్మన్లు, వైస్ చైర్మన్లు కోరారు.

విద్యార్థి మిత్ర ఉపయోగకరం

పావగడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థి మిత్ర పత్రిక ప్రతి విద్యార్థికి ఎంతో ఉపయోగపడుతుందని ఐటీడీపీ మధుగిరి ఇన్‌చార్జి గంగాధర్ప అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యార్థి మిత్ర పత్రికను ప్రతి విద్యార్థి చదివితే జీవితంలో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. సీఆర్పీ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశ్, సీఐ సురేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అగళి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏఓ నాగరాజు సూచించారు. నరసాంబుది, రామనపల్లి, కసాపురం, జీజీ హళ్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో వివిధ రకాల పథకాలు, పంటల బీమా, విత్తనశుద్ధి, కౌలు కార్డులు, పంట నమోదు తదితరవాటిపై అవగాహన కల్పించారు.

●సోమందేపల్లి: ఖరీఫ్ సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏఓ విజయభారతి సూచించారు. బుధవారం మండలంలోని మండ్లి, బ్రహ్మసముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంట నమోదు, మట్టినమూనాల ఆధారంగా ఎరువులు వాడటం, సూక్ష్మపోషకాలు అందించడంపై అవగాహన కల్పించారు. ఏఈఓ లేఖ్య, ఈఓ సుబ్రహ్మణ్యం, వీఏఏ అరుణ, ఎంపీఈఓ మహేష్, ఆంజనేయులు, మద్దన్న, శ్రీరాములు, ఆదిశేషప్ప, నంజప్ప, చంద్రప్ప, హనుమంతప్ప, రైతులు పాల్గొన్నారు.

●అమరాపురం/ గుడిబండ: మండలంలోని మద్దనకుంట, అమరాపురం, మోరుబాగల్, తాళికెర, గునిమోరుబాగల్, యస్. రాయాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం వ్యవసాయశాఖాధికారులు మంజునాథ్, వీరనరేష్ వేర్వేరుగా నిర్వహించారు. జూలై నెల ఆఖరులోగా వేరుశనగ విత్తుకోవచ్చన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా కింద జిల్లా యూనిట్‌గా రాగి, ఆముదం, మండలస్థాయి యూనిట్‌గా వరి, మొక్కజొన్న, గ్రామస్థాయి యూనిట్‌గా కంది పంటను పరిగణించినట్లు తెలిపారు.



అమరాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

సార్వత్రిక సమ్మె ప్రశాంతం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ నాలుగు కోడ్‌లను రద్దుచేయాలని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె పురస్కరించుకుని బుధవారం బ్యాంకులు, ఎల్‌ఐసీ కార్యాలయంతోపాటు మున్సిపల్ కార్మికులు, పారిశ్రామికవాడ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సీపీఐ, సీపీఎం, అనుబంధ సంఘాలు సమ్మెల్లో పాల్గొన్నాయి. ర్యాలీలు, మానవహారాలు, ధర్నాలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



పారిశ్రామికవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



గోరంట్ల: బూదిలి పరిశ్రమ వద్ద సమ్మెలో పాల్గొన్న కార్మికులు



అగళిలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సోమందేపల్లిలో మానవహారంగా ఏర్పడ్డ అంగన్‌వాడీ కార్యకర్తలు



పెనుకొండ అంబేద్కర్ సర్కిల్‌వద్ద రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు



పావగడ: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు